నమస్తే తెలంగాణ
కరీంనగర్
10 | కరీంనగర్, బుధవారం 19 మార్చి 2025 | KARIMNAGAR

# లవర్ కోసం గర్ల్స్ ఫైట్!

వేములవాడలోని ప్రైవేట్ కళాశాల వద్ద ఘటన

- ఇద్దరూ ఇంటర్ సెకండియర్ అమ్మాయిలే • ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

వేములవాడ, మార్చి 18: ప్రియుడు తన వాడంటే.. తన వాడు అని ఓ ఇద్దరు బాలికలు కొట్టుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. వేములవాడ పట్టణంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలు శనివారం ఓ ప్రైవేట్ కళాశాల వద్ద లవర్ కోసం గొడవపడ్డారు. 'అతడు ముందుగా నన్నే ప్రేమించాడు. ఎందుకు నువ్వు అతనితో తిరుగుతున్నావు. మాట్లాడుతున్నావు' అంటూ ఒకరు గొడవకు దిగారు. 'లేదు అతను నన్నే ఇష్టపడుతున్నాడు. నాతోనే జీవితాంతం ఉంటానని మాట ఇచ్చాడు' అంటూ మరొకరు వాదించారు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. గొడవ తీవ్రమైంది. దాదాపు అరగంటకు పైగా ఇద్దరు కొట్టుకోవడంతో అక్కడే ఉన్న స్నేహితులు వారిని విడిపించినట్టు తెలిసింది. ఇరువురు కూడా గొడవపడిన తీరు అందర్నీ ఆశ్చర్యపరచగా, ప్రస్తుతం ఈ గర్ల్స్ గొడవ హాట్‌టాపిక్‌లా మారింది.



పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు బొడ్డు రవీందర్, రఘువీర్ సింగ్, దాసరి ఉష, గంట రాములు, ఉప్పురాజ్‌కుమార్ తదితరులు




కరీంనగర్ రూరల్ మండలంలో నెల కిందటే ఎండిపోయిన గరిమిల్ల కుంట

సాగునీరు లేక బీటలు వారిన పొలం



# చెరువులు ఎడారి

**కరీంనగర్ జిల్లాలో 68వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం!**

మండుటెండల్లో నిండుకుండలను తలపించి.. మత్తళ్లు సైతం దుంకి ఆదరువుగా నిలిచిన చెరువులు నేడు వట్టిపోతున్నాయి. ఏడాదిన్నర కిందటి వరకు పల్లెలకు జీవం పోసినా ప్రస్తుతం ఎడారులను తలపిస్తున్నాయి. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో అడుగంటిన చెరువులు, కుంటలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఏడాదిన్నర కిందటి వరకు గ్రామంలో వందల ఎకరాలకు నీరందించిన ఈ కుంటలు, ఇప్పుడు చుక్కనీరివ్వలేని దుస్థితికి చేరాయి. మరోవైపు భూగర్భ జలాలు ఊహించని విధంగా పడిపోతుండగా, పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బోర్లు, బావుల్లో నీటి మట్టం పడిపోయి పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తుండగా, దాదాపు 68 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. చెరువులు, కుంటల కింద రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

- నాడు మండుటెండల్లో నిండుకుండలు • ఏడాదిన్నర కిందటి వరకు పుష్కలంగా జలాలు
- నేడు మార్చిలోనే వట్టిపోయిన తటాకాలు • మొగ్దుంపూర్‌లో ఎండిన చెరువులు
- భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం • ఎండుతున్న పంట పొలాలు • ఆందోళనలో రైతులు

కరీంనగర్, మార్చి 18 (నమస్తే తెలంగాణ)/ కరీంనగర్ రూరల్ : కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో ఏడాదిన్నర కిందటి వరకు మంచి పంటలు పండాయి. ఏ యేడాది వానకాలం కూడా బాగానే చేతికొచ్చాయి. ఈ యాసంగిలో కూడా నీళ్లుంటాయనే ఆశతో వేసిన పంటలపై తీవ్ర ప్రభావం పడింది. పదేళ్లలో ఎన్నడూ చూడని దుర్భిక్ష పరిస్థితులు గ్రామంలో అలుముకుకోగా, రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. బతుకమ్మ చెరువు గతేడాది యాసంగి పంటకు నీళ్లందించింది. ఇరుకుల్ల వాగు పక్కనే ఉన్న ఈ చెరువు కింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉన్నది. యాసంగి నీళ్లు వస్తయో లేదోనని కొందరు రైతులు సాగు భూమిని బీడుగా వదిలేస్తే.. పంటలు వేసిన రైతులు నీటి కోసం పడరాని తిప్పలు పడుతున్నారు. బోర్లు, బావులు అడుగంటిపోగా, పంటలను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు. ఇప్పటికే అనేక మంది పొలాలు ఎండిపోయాయి. చాలా మంది పంటలు చేతికి రాకుండా పోతున్నాయి. గ్రామంలోని గరిమిల్ల చెరువు నెల క్రితమే చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. 150 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. బావుల్లో ఉన్న నీళ్లతో పొలాలను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్న క్రమంగా తడారి పోతున్నాయి. బావు, బోర్లు చూస్తే అడుగంటుతున్నాయి. మరో నెల రోజులు సాగునీరు అందిస్తే తప్ప పంటలు చేతికి వచ్చే పరిస్థితులు లేవు. పొలాలు ఎట్లా పారించేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గాండ్లకుంట కింద 60 ఎకరాలు, కుమ్మరిగిద్దెకుంట కింద 30 ఎకరాలు, అవుసుల కుంట కింద 50 ఎకరాల పరిస్థితి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. బావులు, బోర్లలో నీళ్లతోనే పొలాలు పారించే ప్రయత్నం చేస్తున్నారు. ఎండిన మడులు తడిపే ప్రయత్నం చేయడం లేదు. ఉన్న పంటను కాపాడుకోవాలనే ప్రయత్నంలో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఒక్క కొమ్మికుంట పరిధిలో కొన్ని నీళ్లు ఉన్నాయని, దీని కింద 100 ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ ఉన్న నీళ్లు కొద్ది రోజులు కూడా సరిపోయే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని మరి కొన్ని ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.



మొగ్దుంపూర్‌లోని బతుకమ్మ చెరువు

## ఎడాదిలో ఎంత లోతుకో..

రాష్ట్ర ప్రభుత్వం నీటిపై సరైన ప్రణాళికను సిద్ధం చేయకపోవడంతో కాలువల ద్వారా చెరువులు, కుంటల్లోకి నీళ్లు వదల లేదు. ఏడు రోజుల వ్యవధిలో సాగునీటిని నేరుగా పొలాలకు వదలడంతో భూగర్భ జలాల స్థిరీకరణ పడిపోయింది. గతేడాదికి ఇప్పటికి పోలిస్తే కొన్ని మండలాల్లో మీటరు కంటే ఎక్కువ లోతుకు పడిపోయాయి. చిగురుమామిడి మండలంలో గతేడాది ఫిబ్రవరిలో 9.96 మీటర్లు ఉన్న భూగర్భ జలాలు ఈ యేడాది అదే నెలలో 10.02 మీటర్లకు పడిపోయాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు ఉన్న చొప్పదండి మండలంలో గతేడాది 9.41 మీటర్లలోనే ఉన్న భూగర్భ జలం, ఇప్పుడు 11.65కు పడిపోయి ప్రమాదఘంటికలు మోగిస్తున్నది. మరో ఆయకట్టు ప్రాంతం ఇల్లందకుంటలో 4.32 మీటర్ల నుంచి 6.35 మీటర్లకు పడిపోయింది. కొత్తపల్లి మండలంలో అయితే మరింత ప్రమాదకరంగా ఉన్నది. గతేడాది 6.93 మీటర్లలో ఉన్న భూగర్భ జలాలు ఇపుడు 10.65 మీటర్లకు పడిపోయాయంటే ఎంత ప్రమాదకంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. హుజూరాబాద్, తిమ్మాపూర్, సైదాపూర్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ఫిబ్రవరి నివేదిక ప్రకారం చూస్తే శంకరపట్నం, వీణవంక, గన్నేరువరం మండలాల్లో కొంత వరకు భూగర్భ జలాలు స్థిరంగా కనిపిస్తున్నాయి. ఈ నెలలో మరింత పడిపోయే ప్రమాదమున్నది. అయితే ఆయకట్టు మండలాలకు నీటి సరఫరా నిలిపి వేసిన తర్వాత నీటి కష్టాలు విపరీతంగా ఉండే ముప్పు ఉన్నది.



చెరువు ఆయకట్టు పరిధిలో ఎండి పోతున్న ఆకు కూర పంట

## ప్రశ్నార్థకంగా 68వేల ఎకరాలు!

కేసీఆర్ ప్రభుత్వంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలకు అనుసంధానమైన ప్రతి చెరువు, కుంటను నింపి భూగర్భ జలాలు వృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కరీంనగర్ జిల్లాలో మొగ్దుంపూర్‌తోపాటు అనేక గ్రామాల రైతులు చెరువులు, కుంటలపై ఆధారపడి వ్యవసాయం చేసుకున్నారు. కానీ, ఈ సారి మాత్రం నేరుగా పంటలకు మాత్రమే నీళ్లు వదులుతున్నారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటిని ఇస్తున్నారు. ఆన్ పీరియడ్‌లో ఎనిమిది రోజులపాటు నీళ్లిస్తున్నారు. నీళ్లు తక్కువగా వదలడంతో పైనున్న ఆయకట్టుకే సరిపోవడం లేదు. దీంతో చివరి ఆయకట్టులో ఉన్న మొగ్దుంపూర్‌లాంటి అనేక గ్రామాల రైతులు సాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 1,376 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న చెరువులు 137 ఉండగా, వంద ఎకరాలలోపు ఉన్నవి 1,239 చెరువులు ఉన్నాయి. కాలువల ద్వారా నీళ్లు వదలడంతో గత బీఆర్‌ఎస్ పాలనలో ఈ చెరువులు, కుంటలు నిండు వేసవిలో కూడా మత్తళ్లు పడ్డాయి. వాగులు, ఒర్రెల ద్వారా నీటి దారలు పారడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. బావులు, బోర్లలో నీళ్లు పైపైకి చేరాయి. ఏడాదిలో రెండు పంటలకు సాగునీటి లోటు లేకుండా ఉండేది. పుష్కలమైన పంటలు పండించి రైతులు ఎంతో సంతోషంగా కనిపించేది. ఇపుడా పరిస్థితి లేకపోవడంతో అనేక గ్రామాల్లో చెరువులు ఎడారుల్లా మారాయి. వాటిపైనే ఆధారపడి సాగు చేసిన పంటలు ఎండి పోతున్నాయి. దాదాపు 68ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. కన్నీళ్లు దిగమింగుతున్న రైతులు తమ పొలాలను పశువుల మేతకు వదిలేస్తున్న దుస్థితి కనిపిస్తున్నది.



### పదేండ్ల సంది కరువే లేకుండె

మా ఊరికి పదేండ్ల సంది నీళ్లకు సావు లేకుండే. చెరువులు కుంటలు ఇట్ల తెర్లయితయని అనుకోలే. ఏడెనిమిది చెర్లు, కుంటల్ల నిట్టెండ కాలం సుతం నీళ్లు పుష్కలంగా ఉండే. నీటికి కరువు లేకుంట పంటలు పండినయి. రైతులకు ఎసొంటి రంది లేకుండ రొండు పంటలు పండిచ్చుకున్నరు. మా చెరువులకు కాలువలతోని నీళ్లిడిచేది. ఎల్లమ్మ గుడికాంచి వాగుల చిన్న దారవోయినా బావుల్ల నీళ్లుండేటియి. ఇపుడు అటు వాగు ఎండిపోయింది. ఇటు చెరువులెండి పోయినయి. నీళ్లకు కరువచ్చింది. పంటలు చేతికస్తయన్న నమ్మకం పోతున్నది. చెరువుల్ల నీళ్లుంటయని వాన కాలంల 32 వేలు పెట్టి చాప పిల్లలు పోసుకున్నం. ఒక్క చాప పట్టింది లేదు. మొత్తం లాసే. చాపలు పోతే పోయినగాని పంటలన్నా దక్కాలెగదా!

**- జెట్టి తిరుపతి, మొగ్దుంపూర్**

# రైతుల కన్నీళ్లకు కారణం కాంగ్రెస్సే

- కాళేశ్వరంను ఎండబెట్టిన పాపం తప్పక తగులుతది
- ప్రాజెక్ట్ సేఫ్ అయితే.. గోదారిని ఎందుకు ఎండబెట్టిన్రు
- వెంటనే రివర్స్ పంపింగ్ చేసి నదిని నింపాలి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- కరీంనగర్‌కు చేరుకున్న మహా పాదయాత్ర

పెద్దపల్లి, మార్చి18 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అక్కసు.. కాళేశ్వరంపై కుట్రతో ప్రాజెక్టును ఎండబెట్టిన పాపం కాంగ్రెస్‌కు తప్పక తగులుతుందని బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శాపనార్థాలు పెట్టారు. ఎద్దేడ్చిన ఎవుసం.. రైతేడ్చిన రాజ్యం బాగుపడినట్టు చరిత్రలో లేదని చెప్పారు. రైతుల కన్నీళ్లకు కారణమైన కాంగ్రెస్‌కు, రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కార్‌కు ఆ శాపం తప్పక తగులుతుందన్నారు. గోదావరి తల్లి కన్నీటి గోసను కండ్లగడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టతను వివరిస్తూ, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ చేపట్టిన మహా పాదయాత్ర రెండో రోజు మంగళవారం ఉదయం పెద్దపల్లిలోని బంధంపల్లి స్వరూప గార్డెన్స్ నుంచి ప్రారంభమైంది. 30కిలోమీటర్లు నడిచి రాత్రి వరకు కరీంనగర్ చేరుకున్నది. కేఎస్‌ఎల్ గార్డెన్స్‌లో బస చేసింది. పెద్దపల్లిలో బృందానికి పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు దాసరి ఉష, రఘువీర్‌సింగ్, గంట రాములు, పూదరి చంద్రశేఖర్, పస్తం హన్మంతు, పూదరి చంద్రశేఖర్, భిక్షపతి, పెద్ది వెంకటేశ్, తబ్రేజ్ పూల మాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల చందర్ మాట్లాడారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను అడుగడుగునా మోసం చేసిందని, సాధ్యంకాని హామీలతో ప్రజలను నిలువునా ముంచిందని ధ్వజమెత్తారు. పాలన చేతకాక రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడు నీటికోసం తండ్లాడలేదని, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో నీటికోసం అరిగోస పడుతున్నామని వాపోయారు. గోదావరిని ఎండబెట్టడంతో ఇరువైపులా సాగు, తాగునీటికి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జంతుజీవాలు, పశుపక్ష్యాదులు గుక్కెడు నీళ్లు లేక అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపం ఊరికే పోదని, గోదావరిని ఎండబెట్టిన ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కాళేశ్వరం సేఫ్ అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారని, సేఫ్‌గా ఉంటే గోదావరిని ఎందుకు ఎండబెట్టారని నిలదీశారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లకు ఎందుకు మరమ్మతు చేయడం లేదో చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వెంటనే నీళ్లను ఆపి రివర్స్ పంపింగ్ చేసి నదిని నిండుకుండలా మార్చాలని డిమాండ్ చేశారు.

### ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి

కాంగ్రెస్ పాలనలో సాగు, తాగు నీళ్లు లేక రైతులు, ప్రజలు అల్లాడుతున్నరు. కన్నీటి కష్టాలను దూరం చేసేందుకే గోదావరి తల్లి కన్నీటి గోస మహాపాద యాత్రకు బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ శ్రీకారం చుట్టిండు. తెలంగాణ ప్రాంతాన్ని కాంగ్రెస్ నిలువునా ముంచుతున్నదనే విషయాన్ని ప్రజలకు వివరించేందుకు ఉపయోగపడుతుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి కాళేశ్వరం బ్యారేజీలను నింపి సాగు, తాగు నీరును ఇవ్వాలి.

**- దాసరి ఉష, బీఆర్‌ఎస్ నాయకురాలు (పెద్దపల్లి)**




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# మానకొండూర్‌లో కమీషన్ల పాలన

- ఏడాదిన్నరలో అభివృద్ధి శూన్యం • సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు రానివారు వివరాలివ్వండి • డబుల్ రోడ్డు పూర్తిచేసేదాకా పోరాడుతాం
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


గన్నేరువరం, మార్చి 18 : మానకొండూర్ నియోజకవర్గంలో కమీషన్ల పాలన నడుస్తున్నదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. ప్రజలకు అలవిగాని హామీలతో ఆశలు చూపి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. గన్నేరువరం మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే నెలలోపే డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి ఏడాదిన్నర గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నెల రోజుల సమయంలో పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను ఇప్పటి వరకు ప్రారంభించలేదని ఎద్దేవా చేశారు. కమీషన్లు తీసుకోవడం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వేదికగా సీఎంఆర్‌ఎఫ్ స్కాంకు కవ్వంపల్లి సత్యనారాయణ తెరలేపారని ఆరోపించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు రాని బాధితులు మానకొండూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కార్యాలయంలో వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, పుల్లెల లక్ష్మణ్, గుడెల్లి ఆంజనేయులు, న్యాత సుధాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యలపై కోరుట్ల ఎమ్మెల్యే గళం



శాసన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, మార్చి 18 : నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై అసెంబ్లీలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల గళమెత్తారు. మంగళవారం జీరో అవర్‌లో పలు అంశాలను ప్రస్తావించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఏర్పడి పదిహేను నెలలవుతున్నా ఒక్క రూపాయి కూడా విడుదల కావడం లేదని అన్నారు. తమ నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలు ఉన్నాయని, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కోసం రూ.15 కోట్ల చొప్పున నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం చెప్పులు అరిగేలా తిరిగినా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని వాపోయారు. వెంటనే సంబంధిత ఆర్థిక శాఖ మంత్రి చొరవ తీసుకుని నిధులు విడుదల చేయాలని కోరారు. మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖాన భవనం శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడుతుందని పలుసార్లు వైద్యారోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా నిధులు మంజూరు కావడం లేదన్నారు. మల్లాపూర్ మండలం మొగిలిపేటలో 350 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారు కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే వాళ్లని అరెస్ట్ చేయించడం సరైందేనా..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే వారిని ప్రభుత్వం ముందస్తు అరెస్ట్ చేయిస్తున్నదని విమర్శించారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందో లేదో అనేది ప్రభుత్వం ఒకసారి సరిచూసుకోవాలని సూచించారు. మల్లాపూర్ మండలం రేగుంట మాటు కాలువకు ₹2 కోట్ల నిధులు కేటాయించి మరమ్మతులు చేయిస్తే సుమారు రేగుంట, వేంపల్లి గ్రామాల్లోని 2 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం తమ నియోజకవర్గంపై దృష్టి పెట్టి అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని కోరారు.



చుక్క నీరు లేక ఎండిపోయిన మద్దిమల్ల రాయినీ చెరువు

# రైతన్నకు అండగా..

- సాగునీటి కోసం నేడు బీఆర్‌ఎస్ పోరుబాట
- మద్దిమల్ల రాయినీ చెరువు - వీర్నపల్లి దాకా నేతల పాదయాత్ర
- పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు ఆధ్వర్యంలో కార్యక్రమం

వీర్నపల్లి, మార్చి 18: కాంగ్రెస్ తెచ్చిన కరువుతో అల్లాడిపోతున్న రైతులను చూసి చలించిపోయిన బీఆర్‌ఎస్ సాగు నీటి కోసం పోరుబాట పడుతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు సిద్ధమైంది. వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాలకు నీరందించేందుకు బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక చొరవతో రాయినీ చెరువు ఎత్తిపోతల పథకానికి ₹166కోట్లు మంజూరు చేయించిన విషయం తెలిసిందే. మల్కపేట రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా రాయినీ చెరువును నింపి, ఇక్కడి నుంచి కాలువల ద్వారా మండలంలోని గొలుసుకట్టు చెరువులు, చివరన ఉన్న వన్‌పల్లి హన్మాయిచెరువును నింపాలని ప్రణాళిక రూపొందించారు. అయితే మల్కపేట రిజర్వాయర్ నుంచి చేపట్టిన పైప్‌లైన్ పనులను తుది దశకు చేరిన టైంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మధ్యలోనే ఆగిపోయాయి. ఈ యాసంగిలో సాగు నీరందక పంటలన్నీ ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో రైతులకు అండగా నిలవాలని బీఆర్‌ఎస్ భావించింది. నీటికోసం పోరుబాట పట్టాలని సంకల్పించింది. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో మద్దిమల్ల రాయినీ చెరువు నుంచి వీర్నపల్లి దాకా పాదయాత్ర చేపట్టబోతున్నది. అనంతరం తహసీల్దార్‌కు వినతపత్రం అందించి, అక్కడి నుంచి అల్మాస్‌పూర్ పంప్‌హౌస్‌కు చేరుకొని పరిశీలించనున్నది. కాగా, పాదయాత్రలో రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వీర్నపల్లి మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి కోరారు.




సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

# ప్రశ్నించే గొంతులపై నిర్బంధం

- బీఆర్‌ఎస్వీ నాయకులపై ఉక్కుపాదం • అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు

వేములవాడ/ సిరిసిల్ల టౌన్, మార్చి 18: బీఆర్‌ఎస్ నాయకులపై ప్రభుత్వ నిర్బంధం కొనసాగుతున్నది. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తున్న వారి గొంతులను నొక్కేస్తున్నది. ఉస్మానియా యూనివర్సిటీలో సభలు, సమావేశాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్‌ని రద్దు చేయాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వేకువ జామున ఎక్కడ దొరికితే అక్కడ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లను తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ నాయకులు మాట్లాడుతూ అనేక ప్రజా ఉద్యమాలకు వేదికైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిరసన కార్యక్రమాలపై ఆంక్షలు విధించడం సీఎం రేవంత్ రెడ్డి నియంత పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి దొడ్డిదారిన రావచ్చు కానీ, ఓయూ విద్యార్థులు నిరుద్యోగ సమస్యల ప్రశ్నిస్తే తప్పేంటని ప్రశ్నించారు. విద్యాశాఖను తన దగ్గర పెట్టుకుని విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని రద్దు చేయాలని చేస్తున్న కుట్రలు మానాలని డిమాండ్ చేశారు. 100 సంవత్సరాల చరిత్ర గల ఉస్మానియాలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా నిర్బంధాలను కొనసాగించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.